ప్రజాశక్తి

మంగళవారం 18 నవంబర్ 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

బంటుమిల్లి తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

దాళ్వాకు అనుమతివ్వాలని

రైతుల పాదయాత్ర

● అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - బంటుమిల్లి : బంటుమిల్లి మెయిన్ కాల్వ పరిధిలో దాళ్వా వరిసాగుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కృష్ణాజిల్లా బంటుమిల్లిలో రైతులు పాదయాత్ర నిర్వహించారు. రైతుల ప్రయోజనాలను కాపాలని నినదిస్తూ మండలంలోని పెందుర్రు గ్రామ నుండి బంటుమిల్లి తహశీల్దారు కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఈ ఏడాది దాళ్వాకు నీరవ్వలేమని, రబీలో వరికి బదులు ఆరు తడి పంటలు వేసుకోవాలని ప్రకటించడం శోచనీయమన్నారు. బంటుమిల్లి మెయిన్ కాల్వ పరిధిలో రైతులకు గత ఐదేళ్ల నుండి దాళ్వాలో వరిసాగుకు అనుమతి ఇవ్వడంలేదన్నారు. ఈ ప్రాంతం సముద్రతీరంలో ఉండడం వల్ల భూమిలో ఉప్పు శాతం పెరిగిపోయిందని, దీంతో 90 శాతం భూముల్లో మినుము తదితర పంటలు సాగుచేసినా ఎకరాకు ఒకటి రెండు క్వింటాళ్లు మాత్రమే దిగుమతి వస్తుందని అన్నారు. ఈనేపథ్యంలో ఖర్చులు కూడా (మిగతా 2లో)

పెందుర్రు నుండి పాదయాత్ర చేస్తున్న రైతులు

రైతు కష్టం.. యంత్రాల పరం..

● నేలవాలిన వరి కోతకు ఎకరాకు రూ.10 వేలు వ్యయం ● వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

సాధారణ పరిస్థితుల్లో ఎకరా వరిని గంటన్నరలో యంత్రాలు నూర్పిడి చేస్తాయి. అయితే మొంథా తుపానుకు నేలవాలిన వరి పొలాల్లో నూర్పిడికి రెట్టింపు సమయం పడుతోంది. దీంతో వరి రైతు కష్టం ఎక్కువగా యంత్రాలకే చెల్లించాల్సి వస్తోంది.

కృష్ణాజిల్లా కంకిపాడు మండలం కుందేరుకు చెందిన మరీదు సాంబశివరావు 2.60 ఎకరాల్లో వరి యంత్రాలతో నూర్చారు. తుపానుకు నేలవాలని వరిని హార్వెస్టింగ్ చేయడానికి 8 గంటలు పట్టింది. ఎకరా విస్తీర్ణంలో హార్వెస్టింగ్ చేయడానికి 3.07 గంటల సమయం పట్టింది. దీనికిగానూ యంత్రానికి రూ.9,230 చొప్పున .60 ఎకరాలకు ఆ రైతు రూ.23,998 చెల్లించారు. ఆ గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరరావు ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. చేను కోతకు వచ్చింది. చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనలతో సాధారణ పద్ధతుల్లో మనుషులతో కోత, కట్టేత వేసేందుకు వెనుకాడుతున్నారు. నేలవాలిన వరి... వర్షాలు కురిస్తే మరింతగా దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నూర్పిడి యంత్రాలు కోసం ప్రయత్నిస్తున్నారు. జిల్లా అంతటా పరిస్థితి ఇలాగే ఉంది. రైతులకు అవసరమైన సంఖ్యలో గ్రామాల్లో యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో వరి నూర్పిడికి గంటకు రూ.3,500 నుంచి రూ.3,700 వరకు రైతుల నుంచి యంత్ర యజమానులు వసూలు చేస్తున్నారు.

తేమశాతం చిక్కులు

17 శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని మాత్రమే ఆర్ఎస్‌కెల ద్వారా సేకరిస్తారు. యంత్రాలతో నూర్చిన ధాన్యంలో తేమశాతం 27 ఉంటోంది. తేమశాతం తగ్గించేందుకు వారం రోజులు వరకు ఆరబెట్టాల్సి వస్తోంది. పరదాలకు అద్దె, ఆరబెట్టిన ధాన్యాన్ని రోజువారీ తిరగవేయడానికి ఎకరాకు మరో రూ.2 వేలు ఖర్చవుతోందని రైతులు వాపోతున్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం ధర తగ్గించి డ్రయర్ మిల్లు యజమానులు కొనుగోలు చేస్తున్నారు. తేమశాతాన్ని శాస్త్రీయంగా లెక్కకట్టి ధర నిర్ణయించడం లేదని, కనీస మద్దతు ధరకు 75 కిలోల బస్తాకు రూ.200కుపైగా కోత పెడుతున్నారని రైతులు

వాపోతున్నారు.

రోజుకు 4 వేల మెట్రిక్ టన్నులు

పెడన, పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో వరి కోతలు మొదలయ్యాయి. వాతావరణంలో వచ్చిన మార్పులకు భయపడి యంత్రాలతో నూరుస్తున్నారు. 287 రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కె) ద్వారా ధాన్యం సేకరణకు పౌరసరఫరాల సంస్థ ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం 186 ఆర్ఎస్‌కె ద్వారా 26 వేల టన్నులు ధాన్యం సేకరించారు. మూడు రోజుల క్రితం వరకు రోజుకు సగటున రెండు వేల టన్నులు ఆర్ఎస్‌కెల్లో సేకరించారు. ఈనెల 15వ తేదీ నుంచి రోజుకు సగటున 4 వేల టన్నులు ధాన్యం రైతులు ఆర్ఎస్‌కెల ద్వారా అమ్ముకోవడానికి తీసుకు వస్తున్నారు.

ధాన్యం సేకరణలో సమస్యలు తలెత్తకుండా కమిటీలు

శివప్రసాద్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

ధాన్యం సేకరణలో సమస్యలు తలెత్తకుండా జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేశాం. రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాల సంస్థ అధికారులు ఈ కమిటీల్లో ఉన్నారు. ధాన్యం అమ్మకాల్లో ఎటువంటి సమస్య ఎదురైనా రైతులు టోల్ ఫ్రీ నంబర్ 8247693551కు ఫోన్ చేయాలి. వెంటనే సమస్య పరిష్కారానికి అధికారులు అందుబాటులోకి వస్తారు.

కనీస పెన్షన్ రూ. 9 వేలివ్వాలి

● ఎపిఆర్‌పిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు డిమాండ్

● జిల్లా పిఎఫ్ కార్యాలయం వద్ద పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : కనీస పెన్షన్ రూ.9 వేలు, ప్రతి పెన్షన్ దారుడికీ హయ్యర్ పెన్షన్ ఇవ్వాలని ఎపిఆర్‌పిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు డిమాండ్ చేశారు. ఎపిఆర్‌పిఎ కేంద్ర, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు విజయవాడలోని జిల్లా పిఎఫ్ కార్యాలయం వద్ద కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పెన్షనర్ల విద్రోహ దినం పాటించారు. దీనిలో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లా నలుమూలల నుండి బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, కేంద్ర ప్రభుత్వ రంగాలకు చెందిన ఫోరమ్ ఫర్ సివిల్ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు, ఇపిఎఫ్ పెన్షనర్లయిన ఆర్‌టిసి, డెయిరీ, పత్రికా, గిరిజన, కో ఆపరేటివ్, ఆప్కో, ఎన్‌టిటిపిఎస్, ఇతర ప్రైవేట్ రంగాల పెన్షనర్లు నగరంలోని పిఎఫ్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి-మోడీ ప్రభుత్వం పెన్షనర్లను మోసం చేసిందని, తీవ్ర ద్రోహం తలపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెన్షన్ వ్యవస్థను నాశనం చేసి వద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. చివరకు పార్లమెంట్‌ను కూడా పక్కదోవ పట్టించి పెన్షన్ వాలిడేషన్ చట్టం- 2025ను తీసుకు వచ్చిందన్నారు. అలాగే ఇపిఎఫ్ పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ అమలులో దామాషా పద్ధతిన లెక్కించి పెన్షన్ 30 నుండి 35 శాతం తగ్గించి మోసాలకు పాల్పతోందని విమర్శించారు. ఈ విధానాలను విరమించుకోవాలని కోరారు. లేకపోతే డిసెంబరు 9,10 తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఎ.శాస్త్రి మాట్లాడుతూ పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర హాని తలపెట్టిందన్నారు. వారి జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఎంఎన్.పాత్రుడు, ఎపిఆర్‌పిఎ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అవనిగడ్డ పున్నారావు, పి.శ్రీనివాస రావు, నాయకులు బిడిఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పిఎఫ్ జోనల్ కమిషనర్ ద్వారా ప్రధానికి, కేంద్ర కార్మిక శాఖ మంత్రికి వినతిపత్రం పంపారు.

విజయవాడలోని జిల్లా పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

పారదర్శకంగా పత్తి కొనుగోళ్లు

కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి - నందిగామ : పత్తి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అత్యంత పారదర్శకంగా పత్తి కొనుగోళ్లు చేపడుతున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. సోమవారం నందిగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రారంభమైన పత్తి కొనుగోలు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ 2025 -26 పత్తి సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.8,110 కనీస మద్దతు ధరను నిర్ణయించిందని చెప్పారు. తేమశాతం 8, అంతకన్నా తక్కువ ఉన్న పత్తికి ఈ ధర లభిస్తుందని చెప్పారు. 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగిన ప్రతి శాతానికి ఒక శాతం చొప్పున మద్దతు ధర తగ్గుతుందని చెప్పారు. పత్తి అమ్మకానికి రైతు సేవ కేంద్రానికి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకంతో వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. 'కపాస్ కిసాన్" యాప్ ద్వారా పత్తి అమ్మకం స్లాట్ బుక్ చేసుకోవచ్చని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 400 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె.బాలకష్ణ, మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంచాలకులు (ఆర్జెడి) కే.శ్రీనివాసరావు, ఏడి డి.రాజాబాబు, సిసిఐ కొనుగోలుదారు ఎం.వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

నందిగామలో పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

వైసిపి కార్యాలయంపై దాడిని నిరసిస్తూ

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

ప్రజాశక్తి - విజయవాడ : హిందూపురంలో వైసిపి కార్యాలయంపై దాడిని నిరసిస్తూ సోమవారం విజయవాడలో ఆందోళన నిర్వహించారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి వైసిపి కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారని అన్నారు. వైఎస్‌ఆర్ విగ్రహాన్ని కూడా పగులకొట్టారన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో దాడులు తప్ప అభివృద్ధి, సంక్షేమం సరిగా అమలు కావడంలేదన్నారు. మాజీ ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు మాట్లాడుతూ వైసిపి కార్యాలయంపై దాడి దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. దాడిపై టిడిపి నేతలు క్షమాపణలు చెప్పాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మంత్రి సత్యకుమార్ పేరుతో నకిలీ టిటిడి లెటర్లు

సిపికి మంత్రి పిఎ ఫిర్యాదు

ప్రజాశక్తి - విజయవాడ : వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పేరుతో నకిలీ టిటిడి లెటర్ల జారీపై విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబుకు మంత్రి పిఎ ఫిర్యాదు చేశారు. సిపి కార్యాలయానికి పిఎ వెళ్లి ఫిర్యాదు అందించారు. రెండు నకిలీ టిటిడి లెటర్లు జారీ అయినందున తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని మంత్రి ఆదేశించారు.

అనుమతి లేని పార్కింగ్ పార్టీషన్లు తొలగింపు

ప్రజాశక్తి - విజయవాడ : అనుమతి లేనిదే భవనం, పార్కింగ్ పార్టీషన్లు నిర్మించరాదని విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్న కుమార్ అన్నారు. కష్ణాలంకలోని నాయుడుపేట, భవానీపురంలోని అనధికార పార్కింగ్ పార్టీషన్, పెంట్ హౌస్‌లను గుర్తించి తొలగించారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌గా సోళ్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ఎస్‌టి కమిషన్ నూతన చైర్మన్‌గా సోళ్ల బొజ్జిరెడ్డి, సభ్యులు జీ. సునీత, కే.లక్ష్మి, కే.సాయిరాం, కే. మల్లేశ్వరరావు, వెంకటప్ప సోమవారం నగరంలోని ఆర్‌అండ్‌బి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గిరిజన సంస్కృతీ, ఆచారాలతో కూడిన అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, ఎస్‌సి కమిషన్ చైర్మన్ కే.ఎస్.జవహర్, శాసన సభ్యులు మిరియాల శిరీష హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ సెక్రటరీ చిన్నరాములు, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి పాల్గొన్నారు.

కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

అధ్యాపక ఉద్యమ నేత మాణిక్యరావు వర్ధంతి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : అధ్యాపక ఉద్యమ నేత ఎం.జె.మాణిక్యరావు 17వ వర్ధంతి సందర్భంగా నగరంలోని కెబిఎన్ కళాశాలలో ఎంజె మాణిక్యరావు మెమోరియల్ లెక్చర్ జరిగింది. ముఖ్యఅతిథిగా ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ కే రత్న శీలామణి, పాల్గొన్నారు. 'ఉన్నత విద్య – సామాజిక న్యాయం' అనే అంశంపై ప్రొఫెసర్ ఎన్ రంగయ్య స్మారకోపన్యాసం చేశారు. సభకు ఎంజెఎం మెమోరియల్ కమిటీ అధ్యక్షులు కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించగా, డాక్టర్ కే.మోజెస్, ఉపాధ్యక్షులు ఎస్‌ఆర్‌కె ప్రసాద్, జాయింట్ కార్యదర్శి ఏం.విజయ్ కుమార్, కోశాధికారి డాక్టర్ సోమయ్య శాస్త్రి పాల్గొన్నారు. కళాశాల కార్యదర్శి శ్రీనివాస్, ఎఒ డాక్టర్ వి నారాయణరావు విస్తత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లక్ష రూపాయలు స్కాలర్ పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో అధ్యాపకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మాణిక్యరావు వర్ధంతి కార్యక్రమంలో ప్రముఖులు

సారూ...మోసపోయాం

- స్వయం సహాయక గ్రూపు మహిళల ఆవేదన
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

లక్షలాది రూపాయలకుపైగా నగదును డ్వాక్రా గ్రూపు లీడరు, బుక్ కీపర్ కైంకర్యం చేశారని స్వయం సహాయక గ్రూపు మహిళలు వాపోయారు. తమ నగదు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేధికలో ఆయా గ్రూపుల సభ్యులు వినతులు సమర్పించారు. అవనిగడ్డ గ్రామానికి చెందిన మరియమ్మ గ్రూపు సభ్యుల నుంచి రూ.8.75 లక్షలు, భాగ్యశ్రీ గ్రూపు నుంచి రూ.12 లక్షలు, యాసిన్ గ్రూస్ నుంచి రూ.4.10 లక్షలు వసూలు చేసి బుక్ కీపర్ బ్యాంకు రుణం చెల్లించలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. కృష్ణాజిల్లా కోడూరు మండలం జరుగువానిపాలెం పార్వతీగ్రూపు సభ్యులు చెల్లించిన రూ.3 లక్షల నగదును గ్రూపు లీడర్ బ్యాంకులో జమ చేయలేదని గ్రూపు సభ్యులు ఫిర్యాదు చేవాఉ. మోసం చేసిన ఆయా గ్రూపుల బుక్ కీపర్లపైన, గ్రూపు లీడర్లపైన చర్యలు తీసుకుని తమ నగదు ఇప్పించాలని బాధిత గ్రూపుల మహిళలు విన్నవించారు.

టిడ్కో కాలనీలో సౌకర్యాలు కల్పించండి.. ఇళ్ల స్థలాలివ్వండి

ఒకపక్క నెలనెలా ఇళ్లకు అద్దెలు కడుతున్నాం... మరోపక్క ప్రభుత్వం మంజూరు చేసిన టిడ్కో ఇళ్లకు కిస్తీలు చెల్లించాలని బ్యాంకులు వత్తిడి చేస్తున్నాయని లబ్ధిదారులు వాపోయారు. మచిలీపట్నం మండలం రుద్రవరంలోని టిడ్కో కాలనీలో తమకు కేటాయించిన ఇళ్లలో నివసించడానికి అవసరమైన కనీస మౌలిక వసతులు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ మచిలీపట్నానికి చెందిన ప్యారీ మస్తాన్ బీ, ముంతాజ్ బేగం కోరారు. నాగాయలంక మండలం పెదపాలెంలో పట్టాలు ఇచ్చిన లబ్ధిదారుల ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, ఆక్రమణదారులను ఖాళీ చేయించి వాస్తవ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని ఆ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ రూప, కైతేపల్లి లక్ష్మీతోపాటు మరో 20 మంది 'మీకోసం'లో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

డ్రయిన్ భూమిలో అక్రమ రొయ్యల చెరువు

వ్యవసాయ భూముల్లో పంటల సాగుకు నష్టం చేకూర్చే విధంగా తవ్విన చెరువుల్లో రొయ్యల సాగును నిలిపివేయాలని చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ చింతలమడ, ఘంటసాల మండలం ఘంటసాల, దాలిపర్రు గ్రామాలకు చెందిన రైతులు కోరారు. ఈ చెరువుల్లో రొయ్యలు సాగు చేస్తే మూడు గ్రామాల్లోని 300 ఎకరాలకు నష్టం వాటిల్లుతుందని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సూదాని పూర్ణచంద్రరావు, గొర్రిపాటి కుటుంబరావు, గొల్లపూడి పూర్ణచంద్రరావు జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీకి వినతిపత్రం అందించారు.

వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి

వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఈనెల 14న ప్రభుత్వం విడుదల చేసిన జివో నెంబర్ 15ను అమలు చేయాలని, దీనికి అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ ఇవ్వాలని విజువల్లి చాలెంజ్డ్ యూత్ సర్వీసు అధ్యక్షులు ఫణికుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు అడపా త్రిమూర్తులు కోరారు. గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామానికి చెందిన మత్స్యకార సొసైటీకి ఎన్నికలు జరిపించాలని సొసైటీ సభ్యులు కట్టపోగు రామకృష్ణ తదితరులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా వేమ సాహితీ సంస్థ రజతోత్సవం

'యేమినేని'కి 'సజన సామ్రాట్' బిరుదు ప్రదానం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : బతుకు తెరువు కోసం ఎంతదూరమెళ్ళినా సొంత వూరును గుర్తుంచుకుని ఆ వూరి మేలు కోసం ఆరాటపడేవారు అభినందనీయులని రిటైర్డు డిజిపి డి.కనకరత్నం అన్నారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఐఆర్ఇఎఫ్ కాలేజీ ఆవరణలో ఆదివారం వేమ సాహితీ సాంస్కృతిక సేవాసంస్థ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేమ సాహితీ సాంస్కృతిక సేవాసంస్థ వ్యవస్థాపకులు వేమ వందనం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కనకరత్నం మాట్లాడుతూ ఇరవై ఐదేళ్ల సాహిత్య, కళా సేవ చేస్తున్న వేమ వందనం లాంటి వ్యక్తులు ఈ సమాజానికి చాలా అవసరమన్నారు. నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ ఏటా విద్యార్థినీవిద్యార్థులకు పాటలు, నత్యాల పోటీలు పెట్టి వారికి బహుమతులివ్వడం హర్షణీయమన్నారు. ఈసందర్భంగా పలువురు కళాకారులను, సాహితీవేత్తలను ఘనంగా సత్కరించారు. యేమినేని వెంకటరమణ రాసిన 'రమణీయం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయనను 'సజన సామ్రాట్' బిరుదుతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆరుంబాక గ్రామసర్పంచి కామినేని కోటేశ్వరరావు, బాపట్ల జిల్లా డిఇఒ ఎస్ పురుషోత్తం, చెరుకుపల్లి ఎంఇఒ నవీన్ కుమార్, కావూరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు పలురకాల పోటీలు పెట్టి బహుమతులను అందజేశారు.

యేమినేని వెంకట రమణను సత్కరిస్తున్న దృశ్యం

దాళ్వాకు అనుమతించాలని రైతుల పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఇటువంటి ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం, ఇరిగేషన్ ఉన్నతాధికారులు పున: పరిశీలించి బంటుమిల్లి మెయిన్ కాల్వ పరిధిలో సుమారు 25 వేల ఎకరాల్లో దాళ్వా సాగుకు అనుమతి ఇచ్చి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా రైతులు, కౌలు రైతుల ప్రయోజనాలను, పంట భూములను కాపాడాలని కోరారు. కృష్ణానదిలో పుష్కలంగా నీరుందన్నారు. గతంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీలో ఉన్నా అప్పటి శాసనసభ్యులు బూరగడ్డ వేదవ్యాస్ బంటుమిల్లి మెయిన్ కాల్వ పరిధిలో దాళ్వాకు అనుమతి ఇప్పించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పెడన నియోజకవర్గ ఇన్చార్జి ఉప్పాల రాము, బంటుమిల్లి ఎంపిపి వెలివిల చిన్నబాబు, కృత్తివెన్ను జడ్‌పిటిసి సభ్యులు మైలా రత్నకుమారి, రైతు సంఘం కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు, తాత మలిశెట్టి రాజబాబు, వి. చిన్నారి బాబు, పాలడుగు బాబురావు, మద్దాల నరేష్, సుజ్ఞానం మహేష్, రైతు సంఘం బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల కార్యదర్శులు లంకదాసుల అజయ్ ఘోష్, కూనసాని రాంబాబు, పుప్పాల నరసింహారావు, ప్రత్తి నాగచైతన్య, మాజేటి శివ శీనివాసరావు పాల్గొన్నారు.

పేరు మార్పు / సవరణ

నేను తంటేపుడి సుధ, W/o తంటేపుడి నాగభూషణం, నివాసం డోర్ నెం. 1-548-3బి, బాపూజి నగర్ 3వ లైను, సంజీవ్ హస్పటల్ దగ్గర, బాపూజి నగర్, గుడివాడ, కృష్ణా జిల్లా. ప్రస్తుతం నా యొక్క ఆధార్‌లో నా పేరు **తంటేపుడి సుధ** అని నమోదు కాబడినది. ఇప్పుడు పేరు మార్పు చేయగా **దగాని సుధ, D/o దగాని సుదర్శన్** (DAGANI SUDHA, D/o DAGANI SUDHARSAHAN) గా మార్పు చేయుట జరుగుతుంది. కావున నేటి నుండి నా పేరు **దగాని సుధ** గా పిలవబడును. ఆధార్‌లో మార్పుకొరకు.

దస్తావేజులు పోయినవి

ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం పుల్లూరు గ్రామానికి చెందిన బొర్రా వెంకటేశ్వరరావు S/o పిచ్చయ్య. వెంకటేశ్వర రావు అను నాకు పుల్లూరు గ్రామంలో సర్వే నెం.535/2 య.0.50 సెంట్లు, 537/3 లో య.0.50సెంట్లు ఖాతా నెంబరు. 225 వ్యవసాయ భూమి కలదు. ఈ భూమికి సంబంధించి ఒరిజినల్ దస్తావేజులు తీసుకొని జిరాక్స్ నిమిత్తం ఈనెల 13వ తేదీన ద్విచక్ర వాహనంపై పుల్లూరు నుండి మైలవరం వెలుతుండగా మార్గమధ్యంలో ఎక్కడో జారి పోయాయి. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరు కు 9966757496 సంప్రదించగలరు.

దావా సమన్లు
మహారాజశ్రీ గుంటూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)వారి కోర్టులో
ఓ.యస్.నెం.231/2024

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లపాడు బ్రాంచ్, గుంటూరు తరపున బ్రాంచ్ మేనేజర్ ...వాది
మరియు
గుండాల వెంకటేశ్వర రావు .... ప్రతివాది
టు,
గుండాల వెంకటేశ్వర రావు, తండ్రి.నరసింహారావు, నివాసం.డోర్ నెం.41-29/1-95, కంచర్ల కోటయ్య వీధి,రాణిగారితోట , కృష్ణ లంక, విజయవాడ అర్బన్, కృష్ణా జిల్లా

పై నెంబరు దావాలో వాది, బ్యాంకువారికి రావాల్సిన బాకీ వసూలు కొరకు దాఖలు చేయగా,సదరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:22-12-2024 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:22-12-2024

ఆత్మకూరి ప్రదీప్ కుమార్,
వాది తరపు అడ్వకేట్,
సంపత్ నగర్ , గుంటూరు.

మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు
O.S. No.280/2025

Between:-
Perumalla Murali Krishna ... Plaintif
AND
1. Sai Ayyappa Electricals, Prop : Majeti Suresh Kumar
2. Majeti Suresh Kumar ... Difendents

To:-
1) SRI AYYAPPA ELECTRICALS, Prop; Majeti Suresh Kumar, Hindu, Aged 45 Years,
2) Majeti Suresh Kumar Hindu, Aged 45 Years, Business, R/o. D.No. 23-11-67, N.R.P. Road, Satyanarayanapuram, Vijayawada -11

పై నెంబరు దావాని వాది మీ మీద ప్రోనోట్ బాకీ వసూలు నిమిత్తం దాఖాలు చేసినారు. ఈ దావా 4వ అదనపు జూనియార్ సివిల్‌జడ్జి గారి కోర్టులో యూన్నాది. ఈ దావా నందు ఎన్నిసార్లు నోటిసులు పంపీనను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందు వల్ల, శ్రీకోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటిసులు జారి చేసియున్నారు. కావున ది.08-12-2025వ తేదిన మీరు స్వయంగా గాని, మీ ప్లిడరు గారి ద్వారా గాని ఉదయం 10:30 ని॥లకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించెదను. కావున తెలియచేయుచున్నాము.

(శ్రీ కోర్టువారి అనుమతితో)
వాయిదా తేది:08-12-2025

ఇట్లు
నందిపాటి ఎన్.వి. శ్రీనివాస రావు,
అడ్వకేట్, 11-25-286,
విజయవాడ, **మెయిన్ రోడ్డు, విజయవాడ-1**
తేది:17-11-2025 **సెల్ : 9848319833.**

సివిల్ సర్వీసెస్ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, స్టడీ సర్కిల్ విజయవాడ వారి ఆదేశాల మేరకు సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి జి.రమేష్ తెలిపారు. అర్హత కలిగిన, బిసి, ఎస్‌సి, ఎస్‌టి కులములకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఈ నెల 25 తేదీ లోపల జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం సాధికారత అధికారి, కృష్ణాజిల్లాలో దరకాస్తులు అందజేయాలన్నారు. డిసెంబర్ 5న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని, అందులో ఉత్తీర్ణులు అయినవారికి మెరిట్ ఆధారంగా గొల్లపూడిలోని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇస్తారన్నారు. ఇందులో బి.సి 66 శాతం, ఎస్.సి. - 20 శాతం, ఎస్.టి.-14 శాతం రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి, కృష్ణాజిల్లా, మచిలీపట్నం వారి కార్యాలయంలో గానీ, డివిజన్ పరిధిలోని సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ ధికారుల వారి కార్యాలయంలో గానీ సంప్రదించాలన్నారు.

స్వచ్ఛ రథానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పొడిచెత్త సేకరణ చేసి అందించే ప్రజలకు కిరాణా వస్తువులను అందించే కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని పెంజెంద్ర గ్రామ కార్యదర్శి నాగ మల్లేశ్వరరావు అన్నారు. ఈ పథకానికి సంబంధించిన స్వచ్ఛ రథం సోమవారం మండలంలోని పెంజెంద్ర గ్రామంలో పర్యటించింది. గ్రామంలోని ప్రజలందరూ తమ ఇళ్లలోని ప్లాస్టిక్, ఓల్డ్ బుక్స్, స్టీల్, కార్డ్ బోర్డు, అల్యూమినియం, ఐరన్, పేపర్ వంటి తమ పొడి చెత్త(డ్రై వేస్ట్) స్వచ్ఛ రథానికి అందజేశారు. ఆ పొడి చెత్తకు బదులుగా పప్పు, ఉప్పు, కారం, సబ్బు వంటి కిరాణా వస్తువులు పొందారు. తమకు సహకరించి ఊరిని శుభ్రంగా, పచ్చగా ఉంచేందుకు కృషి చేస్తున్న గ్రామస్తులను కార్యదర్శి మల్లేశ్వరరావు అభినందించారు.

రేపు మచిలీపట్నంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ఆధ్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 19 బుధవారం మచిలీపట్నం నోబెల్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. ఈ జాబ్ మేళాలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్,వరుణ్ మోటార్ ,స్మార్ట్ లింక్స్ వంటి ప్రముఖ కంపెనీలు వారు పాల్గొంటున్నారని ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ గ తెలిపారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసీ పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 7799551228 , 8142416211 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కూరాడ, ఇందిరా కాలనీలో నిర్వహించారు. గుడివాడ నియోజకవర్గ వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశి భూషణ్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని ఖండించారు. ఈ విధానాన్ని నిలుపుదల చేయకపోతే ఉద్యమిస్తామని అన్నారు. వైసిపి నాయకులు పాలేటి చంటి, సాయన రవి పాల్గొన్నారు.

అర్హులకు పెన్షన్లు ఇవ్వాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : గన్నవరం మండలంలోని సూరంపల్లిలో అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి16 మాసాలు గడిచినా నేటికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పుతామనే ఆర్భాటం తప్ప కొత్తగా ఒక్క పరిశ్రమ రాలేదని, యువతకు ఉపాధి దొరకడం లేదని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలు, ప్రజల హక్కులు, వారి అవసరాలు తీర్చగలిగే స్థితిలో పరిపాలన లేదన్న ఆంజనేయులు, ఆ దిశగా ప్రభుత్వ పరిపాలన కొనసాగాలని డిమాండ్ చేశారు. అలా కానిచో ప్రజా వ్యతిరేకత అనివార్యమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కైలే ఏసుదాసు, పులపాక రమేష్, గ్రామ పార్టీ నాయకులు బండారు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా కొండలమ్మ మండప నిర్మాణం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన ఆవరణలో భక్తుల సౌకర్యార్థం కాలక్షేప మండప నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మండప నిర్మాణ పనులను దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ నిర్మాణంలో రూ.30 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్ కాగా రూ.60 లక్షలు సీజీఎఫ్ నిధులతో మొత్తము రూ.90 లక్షలతో నిర్మిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. ఈ మండప నిర్మాణంలో భాగంగా బేస్మెంట్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనుల్ని త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు.

నిర్మాణం పరిశీలిస్తున్న దృశ్యం

30 వరకు కుష్టుపై సర్వే

ప్రజాశక్తి -కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసి కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వే ఈ నెల 17వ తేదీ నుంచి 30 వరకు 14 రోజుల పాటు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ హాలులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,430 బృందాలు ఇంటింటి సర్వే నిర్వహిస్తాయన్నారు. డిఎల్‌ఎటిఓ డాక్టర్ అంబటి వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి బృందంలో మహిళా ఆశా కార్యకర్త, పురుష వాలంటీర్ పాల్గొని ప్రతి రోజూ ఉదయం పూట ఇంటి సందర్శనల ద్వారా సర్వే చేపడతారన్నారు. సర్వేలో గుర్తించిన అనుమానిత కేసులను ఏఎన్ఎం హెల్త్ యాప్‌లో నమోదు చేసి, తదనంతరం వైద్య అధికారులు పరిశీలిస్తారన్నారు. కుష్టు వ్యాధి కేసు కనుగొనబడితే వెంటనే చికిత్స ప్రారంభించడంతో పాటు, సంబంధిత ఇంటి చుట్టుపక్కల 300 ఇళ్ల పరిధిలో ఫోకల్ సర్వే నిర్వహించి దాగి ఉన్న కేసులను గుర్తిస్తామన్నారు. ఇంటి కాంటాక్ట్‌లకు రిఫాంపిసిన్ మందును సింగిల్ డోస్‌గా అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ. నవీన్, డిఎంహెచ్ఓ డాక్టర్ పి. యుగంధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

'మీకోసం' అర్జీల ఆన్‌లైన్ తప్పులపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : మీకోసం అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డీఆర్‌ఓ కె చంద్రశేఖరరావు, అదనపు ఎస్పీ కే ఆర్ ఆర్ సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవితో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమానికి ముందు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను పరిష్కరించే విధానం, వాటిని ఆన్లైన్లో సమర్పించే ప్రక్రియపై అధికారులకు అవగాహన కల్పిస్తూ.. దీనిపై ఎన్నో సార్లు అవగాహన కల్పించినప్పటికీ పదే పదే అవే తప్పులు పునరావృతం అవటం పట్ల నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవగాహన లేక చేసే తప్పులు వల్ల అర్జీలు రీఓపెన్ అవుతున్నాయని, అర్జీ ఎండార్స్మెంట్ చేసే విధానంపై సంబంధిత అధికారులు కిందిస్థాయి అధికారులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని సూచించారు. అర్జీదారు లబ్ధి పొందితే తప్ప సిటిజెన్ బెనిఫిట్ డ్ ఆప్షన్ ఎంచుకోవద్దని, సమస్య ప్రభుత్వ పరిధిలో ఉంటే గనుక అదే అంశాన్ని అక్కడ తెలపాలని సూచించారు. వచ్చే సారి అవే తప్పులు పునరావతం అయితే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

20న కార్తీక వనసమారాధన : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన పులిగడ్డ వార్పు వద్ద మామిడితోటలో కార్తీక వన సమారాధన కార్యక్ర మం జరుగుతుందని నియోజకవర్గ టిడిపి నాయకులు బొబ్బా గోవర్ధన్ తెలిపారు. సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయం వద్ద నాయకులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మోపిదేవి పాల సొసైటీ అధ్యక్షులు బొందలపాటి వరప్రసాద్ తోటలను తెలుగుదేశం నేతలతో కలిసి పరిశీలించారు. ఆరు మండలాలకు చెందిన తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, రావి రత్నగిరి, పర్చూ రీ దుర్గాప్రసాద్, బండే. శ్రీనివాసరావు, మండలి రామ్మోహన్రావు, ఘంటసాల రాజామోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి సిహెచ్ రాజా

బంగారం చోరీ కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : చిలకలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారం చోరీ కేసులో ఐదుగురు అంతర్‌జిల్లాల దొంగలను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి 318 గ్రాముల బంగారంను రికవరీ చేయగా, బంగారం విలువ దాదాపు 40 లక్షల రూపాయలు ఉంటుందని మచిలీపట్నం డిఎస్పి సిహెచ్ రాజా సోమవారం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చిలకలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు నెలల క్రితం బంగారం చోరీ జరిగింది. ఈ కేసును చేధించే క్రమంలో చిలకపూడి ఇన్స్పెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ టీంలను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో బంగారం చోరీ కేసులో ఐదుగురు అంతర్ జిల్లాల నిందితులను అరెస్ట్ చేసినట్లు డిఎస్పి తెలిపారు. వీరిలో బాపట్ల జిల్లాకు చెందిన కారంపొడి విక్రమ్ కుమార్, ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కొత్త రఘునాథ్, షేక్ అమతుల్ ఖదీర్, రావులపాటి అయ్యప్ప, అందుగుల ఉదయ్ కిరణ్‌లను అరెస్టు చేశామన్నారు. వీరిపై గతంలో అనేక దొంగతనాల కేసులు ఉన్నాయని వెల్లడించారు. రికవరీ చేసిన బంగారంను నమోదైన సంబంధిత కేసుల ప్రకారం బాధితులకు అప్పగిస్తామని తెలిపారు. అరెస్ట్ చేసిన ముద్దాయిలను రిమాండ్ కి తరలించారు. ఈ సమావేశంలో సిఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

నాగ సుబ్రహ్మణ్యం (ఫైల్)

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని సింహాద్రి జరుగు నాగ సుబ్రహ్మణ్యం (33) అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంచలనం రేపింది. నాగ సుబ్రహ్మణ్యం సోమవారం ఉదయం సెల్ఫీ తీసుకొని తాను ఎందుకు మరణిస్తున్నది మాట్లాడుతూ ఆ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ద్వారా అప్పుచేసి అప్పులు కట్టలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియో ద్వారా తెలిపాడు. ఆత్మహత్యకు పాల్పడ్డ నాగ సుబ్రహ్మణ్యానికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు అవనిగడ్డ ఎస్సై కె. శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులపై వ్యాఖ్యలు అర్థరహితం : ఎంపిపి

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నష్టాలు రావడానికి కార్మికులే కారణం అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడటం సరికాదని గన్నవరం ఎంపిపి అనగాని రవి అన్నారు. సోమవారం మీడియాతో రవి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం కార్మికుల పోరాట ఫలితంగా, శ్రమ ఆధారంగా కొనసాగుతుందని, అలాంటి పరిశ్రమ ను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తామని కేంద్ర ప్రభుత్వం బాహాటంగానే చెబుతున్న విషయం ముఖ్యమంత్రికి తెలిసిదా అని అన్నారు. సంస్థను కాపాడాలి అనే ఉద్దేశ్యం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే కేంద్ర ప్రభుత్వం చెప్పిన దానికి భిన్నంగా విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత ఘనులు కేటాయించే విధంగా, కార్మికుల సమస్యలు పరిష్కరించే విధంగా చంద్రబాబు ప్రయత్నం చేయాలన్నారు.అలాకాకుండా కార్మికులపై అపనిందలు వేస్తే అదే ప్రజలు తిరగబడతారని అన్నా రు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా కార్మికులపై చేసిన అసత్యాన్ని గుర్తించి కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని, ముఖ్యంగా రెవెన్యూ శాఖ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎన్టీఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుంచి 160 అర్జీలను స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యుటేషన్ సేవలు పారదర్శకంగా అందించాలని, అవగాహన కల్పించాలని చెప్పారు. ఫ్లోచార్టు ప్రకారం దరఖాస్తుల ప్రక్రియ గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్ల నుంచి ప్రారంభమయ్యేలా డివిజన్, మండల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా, పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, అదే సమయంలో అర్జీదారుడికి సంతప్తికర పరిష్కారం లభించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు.



కలెక్టరేట్, విఎంసిలో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి ఆయా విభాగాల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు ఆయా సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. విఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 14 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిసిపి ఉదయారాణి 85 ఫిర్యాదులను స్వీకరించారు. దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు.

'వందేమాతరం' చిత్ర రూప ప్రదర్శన తిలకించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేసిన చిత్ర రూప ప్రదర్శన అద్భుతంగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు.

స్థానిక కలెక్టరేట్‌లో వందేమాతరం చిత్ర రూప ప్రదర్శన ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర సమరానికి స్ఫూర్తినిచ్చిన వందేమాతర గేయాన్ని చిత్ర రూపంలో తీసుకురావటం అభినందనీయమన్నారు. భారతజాతికి స్వాతంత్ర నినాదమైన "వందేమాతరం" సారాంశాన్ని చిత్రరూపం ద్వారా యువతకు సులభంగా తెలియజేయవచ్చన్నారు. వందేమాతరంలోని భావం మన సంస్కృతిని ప్రతిబింబిస్తుందని, నిత్యస్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. సృజనాత్మకతతో చిత్రాలను రూపొందించిన భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావును కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలేష్‌కు నివాళి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: ఏపీ నగరాల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు మరుపిళ్ల తిరుమలేష్ (59) మృతి

పార్టీకి తీరని లోటని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. సోమవారం తెల్లవారు జామున మరుపిళ్ల తిరుమలేష్ ఆయన నివాసంలో అనారోగ్యంతో మృతిచెందారు. తిరుమలేష్ భౌతికకాయాన్ని ఎంపీ కేశినేని శివనాథ్, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్‌మీరా, నాగవంశీయుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నందిగామ: విజయవాడలో జరిగిన కరాటే పోటీలలో

నందిగామ శ్రీ చైతన్య విద్యార్థులు తమ సత్తా చాటారు. ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు-2025లో అద్భుత ప్రతిభ కనబరిచి పలు కేటగిరీలలో పతకాలు సాధించారు. విద్యార్థులను నందిగామ చైతన్య ప్రిన్సిపాల్ రమేష్ పవారి అభినందించారు.

డీజీ లక్ష్మీ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ: స్థానిక గాంధీ సెంటర్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీజీ లక్ష్మీ సెంటర్‌ను సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివద్ధికి మరియు స్వయం ఉపాధి అవకాశాల విస్తరణకు మెప్మా చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. డీజీ లక్ష్మీ సెంటర్ ద్వారా మహిళలకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణలు, ఆర్థిక సాయం, వనరుల సమన్వయం వంటి సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన : సిపి

ప్రజాశక్తి-విజయవాడ: సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టల నియంత్రణపై ప్రజల్లో అవగాహన తీసుకురావడంతో పాటు, పటిష్టమైన చర్యలు తీసుకోవాలని నగరపోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు. పోలీస్ కమీషనర్ కార్యాలయంలో సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టల వంటి నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పించాలనే అంశంపై పోలీసు అధికారులకు, సైబర్ చట్టాలపై శిక్షణ పొందిన సిబ్బందికి సిపి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ చట్టాలపై తర్ఫీదు పొందిన 227 మంది సిబ్బంది, విజయవాడ నగరంలో ఉన్న 227 బ్యాంకులకు వెళ్లి ఆ బ్యాంకులోని అధికారులతో కలిసి బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి సురక్ష అనే కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చామని అన్నారు. బ్యాంకర్స్‌తో పలు సార్లు సమావేశాలు ఏర్పాటు చేశామని, సైబర్ నేరగాళ్లు కరెంటు ఎకౌంట్లు ఏర్పాటు చేసి మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. సేవింగ్స్ ఎకౌంట్ నుంచి కరెంటు ఎకౌంట్‌గా మార్చే ప్రతి ఖాతాను తప్పకుండా పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి సరిత , సైబర్ క్రైమ్ డిసిపి కృష్ణ ప్రసన్న, రూరల్ డిసిపి బి.లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : ప్రజాదర్బారుతో సమస్యలను సత్వరం పరిష్కరించడానికి శ్రీకారం చుట్టినట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బారులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన అనంతరం సంబంధిత శాఖలకు పంపడం జరుగుతుందన్నారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సమస్యలను పరిష్కారిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుశీలదేవి, ఎంపిపి రామినేని దేవిప్రవణ్యవీరస్వామినాయుడు, మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) తదితరులు పాల్గొన్నారు.

కర్లపాటి ఛారిటబుల్ ట్రస్ట్‌కు అంతర్జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి జగ్గయ్యపేట: కర్లపాటి ఛారిటబుల్ ట్రస్ట్ అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలను అనుసరిస్తూ ప్రజాసేవా రంగంలో విశేష కృషి చేసినందుకు ప్రఖ్యాత సర్టిఫికేషన్ సంస్థ ఇంటర్నేషనల్ ఎక్రిడేసన్ ఫోరం గుర్తింపు కలిగిన కొరియా ఎక్రిడేసన్ బోర్డు ద్వారా ఐఎస్ఓ 9001:2015 నాణ్యత నిర్వహణ వ్యవస్థ (క్వాలిటీ మేనేజ్మెంట్ సిస్టం) సర్టిఫికేషన్‌ను పొందింది. సోమవారం స్థానిక సదాశివ బ్రహ్మేంద్ర ఆశ్రమ పీఠాధిపతి శ్రీ స్వామి

రామానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు స్వీకరించారు. ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ ట్రస్ట్ సిబ్బందికి, శ్రేయోభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. నగర ప్రముఖులు డాక్టర్ ఎన్ అనిల్‌కుమార్, అడ్వకేట్స్ జొనబోయిన శ్రీనివాస్‌రావు, స్వామినేని రాము, రాయపూడి వెంకటేశ్వరావు తదితరులు కర్లపాటికి అభినందనలు తెలిపారు.

చిట్టినగర్లో అఖండ దీపారాధన

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా అఖండ దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ కోశాధికారి లాయర్ పిళ్ల శ్రీనివాసరావు, మాధవి దంపతులు దీపారాధన కార్యక్రమం ప్రారంభించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు షిర్డీ సాయిబాబా కళ్యాణ మండలంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. టిడిపి తెలుగు యువత విజయవాడ పార్లమెంటరీ అధికార ప్రతినిధి మాదాల హరిచరణ్ (కిట్టు) పుట్టిన రోజు సందర్భంగా నిర్వహిం చిన ఈ వైద్య శిబిరంలో విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. గుండె, ఆర్థోపెడిక్, ఊపిరితిత్తులు, షుగర్, థైరాయిడ్, కంటి, దంత సమస్యలు ఉన్నవారు అధిక సంఖ్యలో వచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ తిరువూరులో వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేయించామని వివిధ ఆపరేషన్లు, స్టంట్, అవసరమైన వారికి ప్రత్యేక వాహనంలో విజయవాడ తీసుకెళ్లి ఉచితంగా చేయిస్తానని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర

ఆర్గానిక్ సర్టిఫికెట్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ ప్రారంభించగా టిడిపి నాయకులు ఎస్ జనార్దన్ రావు, మోదుగు వెంకటేశ్వరరావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బీరువా బహూకరణ

ప్రజాశక్తి-నందిగామ: జొన్నలగడ్డ జిల్లా పరిషత్ హై స్కూల్‌కు దుర్గగుడి డైరెక్టర్ మన్నె కళావతి దంపతులు బీరువాను సోమవారం బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాజాబీ, గ్రామ సర్పంచ్ లగడపాటి పుష్ప రేణి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిడిఓ

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలంలో ఈనెల 26వతారీకు వరకు ఎంపిక చేసిన పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను విద్యార్థులు గ్రామ స్తులు ఉపయోగించుకోవాలని ఎంపీడీవో డి సుహాసిని అన్నారు. మొవ్వ మండలంలోని భట్లపెనుమర్రు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. మారుమూల ప్రాంతాలకు సైతం ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలలో విద్యార్థులు తమ ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు పంచాయితీ కార్యదర్శి వి ప్రభు కుమార్, మహిళా పోలీస్ సునీత, ప్రధానోపా ధ్యాయురాలు ఆర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'మహాపురుషుడు మండలి' నాటక ప్రదర్శన

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల 19వ తేదీ దివిసీమ ఉప్పెన మృతుల సంస్మరణ కార్యక్రమాన్ని పురస్కరించు కొని ఆ రోజు సాయంత్రం గాంధీ క్షేత్రంలో 'మహాపు రుషుడు మండలి' నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకల సందర్భంగా అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే గంగోత్రి సాయి దర్శకత్వంలో డాక్టర్ దీర్ఘాసి .విజయభాస్కర్ రచించిన మహా పురుషుడు మండలి నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సుప్రసిద్ధ నటీనటులు, సాంకేతిక బందం కలిసి ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ నాటక ప్రదర్శనను ప్రతి ఒక్కరూ తిలకించాలని బుద్ధ ప్రసాద్ కోరారు.

'మీ డబ్బు... మీ హక్కు' పై అవగాహన

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లాలో క్లెయిమ్ చేసుకోని సొమ్ము బ్యాంకుల్లో నిలిచిపోయింది. ఈ సొమ్మును సరైన డిపాజిటర్లకు లేదా వారి చట్టపరమైన వారసులకు తిరిగి అందించే లక్ష్యంతో జిల్లా యంత్రాం గం మీ డబ్బు... మీ హక్కుఅనే విస్తృత అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ తెలిపారు.ఈ మేరకు, కష్ణా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ సంయుక్తంగా ఖాతాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎల్ డి ఎం రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 5.59 లక్షల క్లెయిమ్ కాని ఖాతాలు ఉన్నాయి. వీటిలో నిల్వ ఉన్న మొత్తం విలువ సుమారు రూ. 113 కోట్లు అన్నారు. వీటిలో వ్యక్తిగత డిపాజిటర్ల ఖాతాలు రూ. 81 కోట్లు,సంస్థాగత ఖాతాలు రూ. 27 కోట్లు,ప్రభుత్వ ఖాతాలు రూ. 5 కోట్లు ఉన్నాయన్నారు. క్లెయిమ్ కాని ఈ డిపాజిట్లను తిరిగి పొందేందుకు ప్రజలకు బ్యాంకులు సులభమైన మార్గాలను అందుబాటులో ఉంచాయన్నారు.

యార్లగడ్డ కుటుంబరావుకు ఘన నివాళి

కుటుంబరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న పాములూరి రామయ్య

ప్రజాశక్తి-చల్లపల్లి : యార్లగడ్డ కుటుంబరావు మృతి పార్టీకి తీరనిలోటని మాజీ శాసనసభ్యులు పాటూరు రామయ్య అన్నారు. చల్లపల్లి మండలం నడకుదురు శివారు నాదెళ్లవారిపాలెంకు చెందిన యార్లగడ్డ కుటుంబరావు ఆదివారం మృతి చెందారు. పాటూరు రామయ్య, చల్లపల్లి మండల సిపిఎం కార్యదర్శి యద్దన పూడి మధు, మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, మేడేపల్లి వెంకటేశ్వరరావు, తలారి నాగేశ్వ రావు సీనియర్ నాయకులు సంద్యాల ప్రభు,కలపాల దావీదు, మాతంగి గంగయ్య, అవనిగడ్డ సాంబశివరావు, గొరిపర్తి గోపాలం జటావత్తు బాలాజీ, కాగితవు బసవరాజు, బొట్టు వెంకట్రావు, కొల్లూరు మండల సిపిఎం కార్యదర్శి వేములపల్లి వెంకట్రామయ్య, తదితరులు కుటుంబరావు పార్థివదేహాన్ని సోమవారం సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించి సంతా పం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కుటుంబరావు భార్య బేబీ సరోజిని, కుమారులు గోపాల్, రవి చంద్, కుటుంబ సభ్యులను కలుసుకుని ఓదార్చారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ కుటుంబరావు ఉద్యోగం చేస్తూ ఆర్టీసీ కార్మికుల తరుపున పోరాటం చేశారన్నారు. గతంలో తాను శాసనసభ్యులుగా నిలబడినప్పుడు నా విజయానికి చేసిన కృషి మరువలేనిది అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం, సిపిఎం ఆశయ సాధనకు తుది శ్వాస విడిచే వరకు ఎర్ర జెండా నీడన కొనసాగారని అన్నారు. సోమ వారం జరిగిన అంతిమయాత్రలో కండక్టర్ మోపిదేవి వెంకటరామయ్య, మోపిదేవి ఉమా మహేశ్వరరావు (కండక్టర్), ఎంపీటీసీ సభ్యులు మాలెం పాటి శ్రీనివా సరావు, విశ్రాంత ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణ, చల్లపల్లి పంచాయతీ సభ్యులు అంబటి భువనేశ్వరరావు, పురిట గడ్డ మాజీ సర్పంచ్ సురేష్ పాల్గొన్నారు.

జిల్లా పోటీలకు ఎఎన్ఎం విద్యార్థుల ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పామర్రు : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన చెకుముకి,సైన్సు ప్రతిభ పోటీలలో స్థానిక ఏఎన్ఎం హైస్కూల్ కు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎండి.అష్రఫ్ అలీ ఖాన్,9వ తరగతి విద్యార్థి షేక్ అబ్దుల్ ఆహాద్, ఎనిమిదవ తరగతి విద్యార్థి సిహెచ్.శ్రీదివ్య మండల స్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందారు. వీరిని జిల్లాస్థాయి పోటీలకు పంపనట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.పూర్ణచంద్రారెడ్డి ప్రధానోపాధ్యా యుడు డి.శామ్యూల్ పాఠశాల సిబ్బంది అభినందించారు.

వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రోత్సాహం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-చల్లపల్లి : వ్యవసాయంలో యాంత్రికరణ ద్వారా రైతులకు మేలు చేసేలా దానిని ప్రభుత్వం ప్రోత్సాహిసుతందని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. సోమవారం చల్లపల్లి మండలం మేకవారిపాలెం సొసైటీలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కిసాన్ డ్రోన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి డ్రోన్ల టెక్నాలజీ ద్వారా రైతులకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, ఎంపీపీ కోట విజయరాధిక, సొసైటీ చైర్ పర్సన్ గుత్తికొండ వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు

వైభవంగా శ్రీనివాస కల్యాణం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రీనివాస కళ్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పి వి కృష్ణారెడ్డి, సుధారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కళ్యాణంలో ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపురెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు, పి ప్రసన్న, వెంకటేశ్వర రెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం కావటంతో మహా క్షేత్రాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేద పండితులు శాస్త్రోక్తంగా క్రమబ ద్ధంగా కల్యాణాన్ని నిర్వహించారు. కళ్యాణం అనంతరం నిర్వాహకులు భక్తులకు ప్రసాదం అందచేశారు.

ఘనంగా నాలుగో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలం మందపాకల శివారు పాదాలవారిపాలెం గ్రామంలో శ్రీ అభయ వీరాంజనేయ స్వామి ఆలయ నాలుగవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం నిర్వహించిన ఈ వేడుకలకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విజయలక్ష్మి దంపతులు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ సాయి సుప్రియ దంపతులు విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం కళ్యాణ మహోత్సవంలో పాల్గొనగా, వారిని ఆలయ అర్చకులు, కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించారు.

23 వరకు ఫార్మసీ వారోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్లో, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ గుడ్లవల్లేరు శాఖ ఆధ్వర్యంలో ఈ నవంబరు 17 నుండి 23 వరకు వారం రోజుల పాటు ఫార్మసీ వారోత్సవాలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. లక్ష్మణరావు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీ ఫార్మసీ విభాగ బిఓఎస్ చైర్ పర్సన్ డాక్టర్ పి సుజాత గామ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రెసిషన్ మెడిసన్ అనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఏదైనా విషయాన్ని క్షుణ్ణంగా, క్రమ పద్ధతిలో అధ్యాయనం చేయడం, పరిశీలించడం ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అయితే గుడ్లవల్లేరు శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రవీష మాట్లాడుతూ ఫార్మసిస్టుల నిబద్ధత, వారి నైపుణ్యం వారి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ వారోత్సవాలు దోహదపడతాయని, విద్యార్థులందరూ ఈ వారోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న పోటీలలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్పెషల్ ఏచీవ్మెంట్ అవార్డు గుడ్లవల్లేరు శాఖకు దక్కిందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐపిఎ స్టూడెంట్ ఫోరమ్ సభ్యులకు బ్యాడ్జీలను ముఖ్య అతిధి చేతులు మీదుగా బహుకరించారు. చివరగా ముఖ్య అతిథి డాక్టర్ సుజాత ను మొమెంటుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న దృశ్యం

జనతా ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి పిఏసిఎస్ సంఘ సభ్యులు బత్తుల నాగరాజు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందగా సోమవారం విశ్వనాథపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద బత్తుల నాగరాజు భార్య సుభద్రకు పిఏసిఎస్ చైర్ పర్సన్ తోట సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బండె శ్రీనివాసరావు చేతుల మీదగా 2 లక్షల రూపాయలు జనతా ఇన్సూరెన్స్ క్లైమ్ చెక్కును సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ పర్సన్లు కైతపల్లి పానకాలరావు, విశ్వనాథపల్లి వేణు, సిఈఓ చుండూరు రమేష్, అప్పికట్ల రవీంద్ర, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, బడే వెంకటేశ్వరావు, కోట రత్నారావు, విష్ణుభట్ల సూర్య నారాయణ, కొప్పనాతి వెంకటేశ్వరరావు, తోట సూర్య నరసింహారావు, తోట రాఘవయ్య, సోడా బత్తిన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎన్జీవోస్ పామర్రు యూనిట్ ఎన్నిక

ప్రజాశక్తి-పామర్రు : ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పామర్రు తాలూకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమావేశ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ స్టేట్ ఉపాధ్యక్షుడు ఉల్లి కృష్ణ, జిల్లా అధ్యక్షులు ఆకునూరి శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా పాల్గొనగా గుడివాడ డివిజన్ అధ్యక్షుడు డి.వి.రావు, కార్యదర్శి సునీల్ ఎన్ని కల పర్యవేక్ష కులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పామర్రు తాలూకా యూనిట్ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

నూతన కమిటీ సభ్యులు : పామర్రు తాలూకా యూనిట్ అధ్యక్షులుగా ఏ.నాగబాబు సహాయ అధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్, ఉపాధ్య క్షులుగా పిడివి కుమార్, పివిఎన్వి శ్యాంబాబు,కే. ఆదినా రాయణ, కార్యదర్శిగా ఏ. రాము, సహాయ కార్యద ర్శులుగా ఎం. సాయి కళ్యాణ్,డివి.రమణ టి. రామకృష్ణ, జె.రాజరాజేశ్వరీ దేవి, కోశాధికారిగా ఎం.కిరణ్ కుమార్, పాలక సభ్యుడుగా పి.సీతారామయ్య లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పామర్రు తాలూకా యూనిట్ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను మర్యాదపూర్వకముగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే దుశ్శాలువా కప్పి అభినందించారు.

ఎన్పిఆర్డి మచిలీపట్నం కమిటీ అధ్యక్షులుగా 'మరీదు'

ప్రజాశక్తి -మచిలీపట్నంఅర్బన్ : వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కృష్ణా జిల్లా విస్తృత సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మచిలీపట్నం నగర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. అధ్యక్షులుగా మరీదు నాగబాబు, ఉపాధ్యక్షులు గా గోల్కొండ ఖైదర్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మసాని కామేశ్వరరావు, కార్యదర్శిగా రియాజ్ భాష,సహాయ కార్యదర్శులుగా అబ్దుల్ కదీర్,గంజాల నాగాంజనేయులు, కోశాధికారిగా వంకా రమేష్, సభ్యులుగా మైల రమేష్,డొక్కు మురళి, శివ, విజయకుమార్, అబ్దుల్ అజీజ్, సిహెచ్ శివ కుమారి,గుడిద పద్మలను ఎన్నుకున్నారు.

వెంకటేశ్వరగౌడ్ నియామకం

ప్రజాశక్తి చల్లపల్లి : గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులుగా చల్లపల్లి మండలం వెలివోలు గ్రామానికి చెందిన బొల్లా వెంకటేశ్వరరావు నియమితు లయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర గౌడ్ మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు సంఘం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తనను రాష్ట్ర అధ్యక్షులుగా నియమాకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్స్‌ఎటి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: వివిధ మేనేజ్మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎక్స్‌ఏటీ)-2026 పరీక్ష కు దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నట్టు

నిర్వాహకులు తెలిపారు. 2026 జనవరి 4న ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. భారతదేశం అంతటా 250కి పైగా ప్రఖ్యాత సంస్థలలో ఎంబీఏ, పీజీడీఎం కోర్సులను అభ్యసించాలనుకున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.రిజిస్ట్రేషన్ ఇప్పటికే ప్రారంభమైందని చెప్పారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన ఏదైనా విశ్వవిద్యాలయం నుండి ఏదైనా విభాగంలో కనీసం మూడు సంవత్సరాల వ్యవధి గల బ్యాచిలర్ డిగ్రీని కలిగి ఉండాలన్నారు. చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ xatonline.inను సంప్రదించవచ్చని, ఆ వెబ్సైట్ ద్వారా అభ్యర్థులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు.

సివిల్స్ ప్రిలిమ్స్‌కు ఉచిత కోచింగ్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు ఉచిత శిక్షణ కావాలనుకునే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.లక్ష్మీదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన డిగ్రీ పూర్తిచేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అర్హులని.. బయోడేటాతో పాటు రెండు ఫొటోలు, విద్య, కుల, ఆదాయ తదితర ధ్రువీకరణపత్రాల నకళ్లను అటెస్టేషన్‌తో దరఖాస్తుకు జతచేసి ఈ నెల 25వ తేదీలోపు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి, డోర్ నెం.74-2-1/5, అశోక్‌నగర్, పండరీపురం, రోడ్డు నెం.8, విజయవాడ-52007లో నేరుగా అందజేయాలని సూచించారు. స్క్రీనింగ్ టెస్ట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక జరగనుందని.. ఎంపికైన అభ్యర్థులకు గొల్లపూడిలోని బీసీ భవన్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని.. శిక్షణ కాలంలో ఉచిత బస, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 99668 49937, 86888 55255, 95050 94349 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని లక్ష్మీదేవి పేర్కొన్నారు.

ఉచిత ఉపకరణాల నిర్ధారణకు శిబిరాలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎన్‌టీఆర్ జిల్లాలో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు ఐదు ప్రాంతాల్లో ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.రజనీకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లలోపు ఉండి, సదరం సర్టిఫికెట్ ఉన్న, పాఠశాలలో నమోదైన విద్యార్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం తమ మండల భవిత కేంద్రాల్లోని ఐఈఆర్‌పీలను సంప్రదించవచ్చన్నారు. విజయవాడ అర్బన్‌కు సంబంధించి ఈ నెల 18న ఎంకే బేగ్ హైస్కూల్లో, 19న మైలవరం లక్కిరెడ్డి హనిమిరెడ్డి హైస్కూల్లో, 20న తిరువూరు నియోజకవర్గంలోని కంభంపాడు జెడ్‌పీహెచ్‌ఎస్‌లో, 21న నందిగామ జెడ్‌పీహెచ్‌ఎస్, 22న జగ్గయ్యపేట నియోజకవర్గంలోని చిల్లకల్లు జెడ్‌పీహెచ్‌లో శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని వారు శిబిరాలను సద్వినియోగం చేసుకొని అలిమ్కో ద్వారా ఉచితంగా ఉపకరణాలు పొందేందుకు తగిన ధ్రువీకరణ పత్రాలతో పేర్లు నమోదు చేయించుకోవాలని రజనీకుమారి తెలిపారు.

29 నుంచి ఎపి కాలేజ్ టీచర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవ సంవత్సర కార్యక్రమంగా విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 29, 30 తేదీల్లో 50వ ఏపీ కాలేజ్ టీచర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. మేకా రమేశ్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేశ్ సి.జంపాల, క్రీడా విభాగాధిపతి డా.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా ఉన్న వైద్య, దంత, ఫార్మా, ఇంజనీరింగ్, వ్యవసాయ, న్యాయ, శారీరక విద్య, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల బోధనా సిబ్బందికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్, వెటరన్ డబుల్స్ (45-55 సంవత్సరాలు), సూపర్ వెటరన్ డబుల్స్ (55 ఏళ్ల వయసు పైబడిన వారు), మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పాల్గొనేవారు తన పేర్లను ఈ నెల 20వ తేదీ కల్లా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9989616969, 9948221110 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్ నాకౌట్ కమ్ లీగ్‌లో నిర్వహిస్తామని, ఇతర మ్యాచ్‌లు నాకౌట్ ప్రాతిపదికన నిర్వహిస్తామని చెప్పారు.

పుస్తకాలు సమాజానికి దారి దీపాలు

కల్చరల్ కమిషన్ చైర్పర్సన్ తేజస్విని

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: పుస్తకాలు వ్యక్తిత్వాలను ప్రభావితం చేస్తూ సమాజ చైతన్యానికి దారి దీపాలుగా నిలుస్తాయని క్రియేటివ్ అండ్ కల్చరల్ కమిషన్ చైర్పర్సన్ పొడపాటి తేజస్వి అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కేబీఎన్ కళాశాలలో సోమవారం తేజస్వి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పుస్తకాన్ని మించిన గొప్ప మిత్రుడు మరొకరు ఉండరన్నారు. పుస్తకానికి మించిన వేగమంతమైన టెక్నాలజీ మరొకటి లేదన్నారు. డిజిటల్ తరం తయారు చేసిన వ్యక్తులు అందరూ పుస్తక ప్రేమికులేనని చెప్పారు. వారోత్సవాల సందర్భంగా కనీసం ఒక్క పుస్తకం అయినా చదవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మనోవికాసం సాధ్యమవుతుందన్నారు. విద్యార్థుల జీవితంలో పుస్తక పఠనం భాగం కావాలన్నారు. హిందూ హై స్కూల్స్ కమిటీ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ రీడర్స్ మాత్రమే లీడర్స్‌గా ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా ఫెడరల్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 30 కుట్టు మిషన్లను పేద మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, లైబ్రేరియన్ శ్రీనివాస రాజు, గ్రంథాలయ సిబ్బంది విజయలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామ గ్రంథాలయంలో సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు, విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్ పాల్గొన్నారు. **కంచికచర్ల:** స్థానిక గ్రంథాలయంలో క్విజ్ పోటీలు, కవి సమ్మేళనం, రచయితల సందేశం నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి వి.అమరేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అలీమ్, బాజీ ఖాన్, క్రాఫ్ట్ మాస్టర్ కనకారావు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని గ్రేడ్ వన్ గ్రంథాలయంలో వ్యాసరచన, మ్యూజికల్ చైర్స్ పోటీలు ఉపాధ్యాయులు జి పుల్లారావు, ఎస్‌కె షబానా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.
గంపలగూడెం: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ఇంచార్జ్ జ్యోతిర్మయి తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ ముఖ్య ఘట్టాలపై జరిగిన పోటీలు నిర్వహించారు. పెనుగలను గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు ఇంచార్జ్ తెనాలి వెంకటేశ్వర్లు తెలిపారు.
తిరువూరు: తిరువూరు గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో సోమవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి పద్మావతి, తిరువూరు రచయితల సంఘ అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తేజస్విని

గంపలగూడెంలో...

వన సమారాధనలు సమైక్యతకు చిహ్నాలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

మాదిగదాసు జాతీయ సంక్షేమ సంఘం వన సమారాధన సూరంపల్లి అడ్డరోడ్డులోని మాదాల శ్రీనివాసరావు తోటలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ధార్మిక సేవా తత్పరులు గోకరాజు గంగరాజు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తానని తెలిపారు. సంక్రాంతి సమయంలో హరిదాసుల వాగ్ధాటితో కూడిన ఈ కళ తెలుగువారి సంస్కృతిని తెలియజేస్తుందన్నారు. సమారాధనలు బంధుత్వాన్ని కలుపుకునేందుకు కూడా దోహదపడతాయన్నారు. వన సమారాధన అనంతరం కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి సంఘీయులు, ప్రతినిధులు హాజరయ్యారు. గౌరవ అధ్యక్షులుగా తాళ్లూరు విష్ణువు, అధ్యక్షులుగా మంగళగిరి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా తాళ్లూరి రాజా, మంగళగిరి అమర్నాథ్, పరిశిపాక సీనయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎంవిఎస్‌ఆర్ కె ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా పసుపులేటి కళ్యాణ్,కోశాధికారిగా మంగళగిరి తాండవ కష్ణ, సహాయ కోశాధికారిగా తాళ్లూరి లోకనాథ్ తదితర సభ్యులు ఎన్నికయ్యారు.

'నగరాల'కు అండగా ఎంపి శివనాథ్

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ నగర కులుస్తులకు అండగా నిలిచారు. విజయవాడ చిట్టి నగర్‌లో కొలువైన శ్రీ నగరాల సీతారామ స్వామి మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నిర్వహణ బాధ్యతలను మరో ఐదేళ్ల పాటు ఆ కుల సంఘం ఆధ్వర్యంలోనే కొనసాగేలా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకురావడంలో విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా నగరాల పెద్దలు ఎంపీకి ఆత్మీయ సత్కారాన్ని అందజేశారు. దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్ళ శ్రీనివాస్ సమక్షంలో ఎంపీ శివనాథ్ నగరాల గుడి స్వయపరిపాలన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరాల కమిటీ మెంబర్స్ నరసింహారావు, మజ్జి శ్రీనివాసు, మజ్జి ఈశ్వరరావు, తమ్మిన సూర్యకుమారి, బాయిన బాబ్జి, నల్లని సూర్యారావు, బాయిన శేఖర్‌బాబు, కనిశెట్టి లక్ష్మణరావు, పిళ్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సౌదీ అరేబియా ఘటన బాధాకరం

ప్రజాశక్తి-విజయవాడ: సౌదీ అరేబియాలో రోడ్డు ప్రమాద ఘటన చాలా బాధాకరమని హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాష అన్నారు. మృతిచెందిన వారి ఆత్మకు సంతాపంగా సోమవారం ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ప్రమాదంలో 42 మంది చనిపోయరాని, అందులో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. సౌదీ అరేబియా ఘటనకు సంబంధించి పూర్తి వివరాల కోసం 9179979 59754, 919912919545 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేశ్‌కింగ్ గోల్డ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రఖ్యాత హెయిర్ కేర్ బ్రాండ్ కేశ్‌కింగ్ సరికొత్త రూపాన్ని జోడించి కేశ్ కింగ్ గోల్డ్ పేరుతో నూతన ఉత్పత్తులు అందించనున్నట్లు సంస్థ ప్రతినిధి ఆర్.కుమారన్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. రీబ్రాండింగ్ చొరవ కారణంగా ఇమామి తన బ్రాండ్ కేశ్ కింగ్ కోసం ఒక ప్రత్యేక వ్యూహాత్మక మార్పును స్వీకరించింద తెలిపారు. ఇందులో మూలపదార్థాలతో 21 నమ్మకమైన ఆయుర్వేద వివిధ మూలికల తత్వాలు ఉన్నాయని తెలిపారు.

విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: విఆర్ఎల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విఆర్ఎల సంఘం జిల్లా సహాధ్యక్షులు మధుబాబు ఆర్‌డిఓ చైతన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వీఆర్ఎల సీనియారిటీ జాబితా ప్రకటించి వీఆర్ఎలకు అటెండర్ వాచ్మెన్, డ్రైవర్లు, రికార్డు అసిస్టెంట్ ప్రమోషన్ కల్పించాలని, ఎన్నో సంవత్సరాలుగా రూ.10,500 జీతంతో కుటుంబ పోషణ భారంగా ఉందని తెలిపారు.

ప్రతి మంగళవారం సర్టిఫికెట్లు జారీ

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

తలసేమియా మేజర్, సికిల్ సెల్ అనీమియా, తీవ్రమైన హిమోఫీలియా, బైలెటరల్ ఎలిఫెంటియాసిస్, తీవ్రమైన కిడ్నీ వ్యాధిగ్రస్థులు, మల్టీ డిఫార్మెటీ లెప్రసీ, కిడ్నీ, లివర్, గుండె మార్పిడి వ్యాధిగ్రస్థులు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ. 15 వేలు పెన్షన్ కొరకు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వారు ప్రతీ మంగళవారం నేరుగా కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి సర్టిఫికెట్లు పొందవచ్చని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ అన్నవరపు వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు విజయవాడ కొత్త గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌కు వచ్చి సర్టిఫికెట్లు పొందే అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ముమ్మరంగా రబీ సాగు

ప్రజాశక్తి-కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లా మెట్ట ప్రాంతంలో రబీ పంటల సాగు ముమ్మరంగా సాగుతుంది. ఈ ఏడాది కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో రబీలో సుమారు పది వేల ఎకరాల్లో పుల్ల శెనగ పంట సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఖరీఫ్ లో పెసర, మినుము, మొక్కజొన్న పంట సాగు చేసిన పొలాలు శభ్రం చేశారు. పది రోజులు నుండి వర్షం లేక పొలాలు ఆరి పదునుగా ఉండటంతో సోమవారం నుండి రబీ పంటగా పుల్ల శనగ సాగు చేపట్టారు. కంచికచర్ల మండలంలో ఈ ఏడాది సుమారు 7500 ఎకరాలు, వీరులపాడు మండలంలో 3 వేల ఎకరాల్లో పుల్ల శనగ పంట సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. పుల్ల శనగ విత్తనాలు జెజి 11 రకం విత్తనాలు ఎకరాకు 50 నుండి 60 కిలోల చొప్పున అరక, లేదా ట్రాక్టర్ యంత్రం సహాయంతో సాగు చేస్తున్నారు. మూడు నెలల కాల పరిమితి గల పుల్ల శనగకు పెద్దగా నీటి అవసరం ఉండదని, పూత దశకు ముందు జల్లులు కరిస్తే సరిపోతుందని రైతలు అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో అధిక వర్షాల వల్ల తీవ్రంగా నష్ట పోయిన రైతులు రబీలో పుల్ల శనగ పంట దిగుబడలు ఆశాజనకంగా ఉంటుందని రైథులు ఆశతో ముమ్మరంగా రబీ పంట సాగులో నిమగ్నమయ్యారు.

ఐక్యతకు ఉమ్మడి కుటుంబాలే పునాది

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోతున్న తరుణంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మచిలీపట్నం సాహితీ మిత్రుల సంస్థ ఆధ్వర్యంలో "నేటి కుటుంబ వ్యవస్థ పట్ల యువత బాధ్యత" అనే అంశంపై పలువురు వక్తలు ప్రసంగించారు. సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మారుతున్న కాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం మంచిది కాదని అన్నారు. ప్రతి కుటుంబంలో యువత తల్లిదండ్రులను పెద్దలను గౌరవించి కుటుంబ బాధ్యతలో పాలు పంచుకోవాలని అన్నారు. విశ్రాంత ఎడిషనల్ ఎస్పీ శాయన సుశీలరావు మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులే రోల్ మోడల్ అని, చిన్నప్పటినుండి పిల్లలకు ఉమ్మడి కుటుంబం లాభాలను

తెలియచేయాలని అన్నారు. అనంతరం స్టడీమెటీరియల్ ఆవిష్కరించారు. మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ టీ. పెద్దిరాజులు, కృష్ణాజిల్లా మాజీ ప్రభుత్వ న్యాయవాది అజ్మతున్ని బేగం, పెడన విజయానంద డిగ్రీ కాలేజీ అధ్యాపకులు వి. విద్యాధర్, కృష్ణాజిల్లా గ్రంథాలయం కార్యదర్శి వేముల రవికుమార్ పాల్గొన్నారు.

రాజాబాబును సత్కరిస్తున్న దృశ్యం

కళాకారులకు పుట్టినిల్లు కృష్ణాజిల్లా : డైరెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : సినీ రంగానికి, బుల్లితెరకు ఎందరో నటీనటులను అందించిన కృష్ణాజిల్లాకు అగ్ర స్థానం ఉందని ప్రముఖ డైరెక్టర్ టి. రాజాబాబు అన్నారు. ఈటీవీ ద్వారా అనేక సంగీత సాహిత్య కార్యక్రమాలలో ఎస్పీ బాలసుబ్రమణ్యం తో కలిసి పాల్గొనడం తన అదృష్టమని రాజబాబు అన్నారు. సోమవారం మచిలీపట్నంలో సాహితిమిత్రులు సంస్థ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ రాజబాబుకు జగన్నాధపురం లంకి శెట్టి కార్యాలయంలో సన్మానం చేశారు. ఎన్టీ రామారావు, ఏఎన్నార్, కైకాల సత్యనారాయణ వంటి మహోన్నత వ్యక్తుల అందించిన జిల్లా కృష్ణా జిల్లా అని, కూచిపూడి పుట్టిన జిల్లాగా అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. శ్రీ శారద కళా నికేతన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అనేక సంగీత సాహిత్య నాటక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ రాజాబాబు తెలియజేశారు. ప్రముఖ నత్య అధ్యాపకులు వై. పూర్ణచంద్రరావు, మచిలీ పట్నం కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి తూమాటి రాజేశ్వరరావు, వాణి స్వీట్స్ అధినేత దిలీప్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-పమిడిముక్కల : దేశభక్తుల చరిత్ర గురించి విద్యార్థులు తెలుసుకోవాలని పమిడిముక్కల గ్రంథాలయాధికారి షరీఫ్ అన్నారు. వారోత్సవాల్లో భాగంగా మండలంలో మేడూరు, పెనుముచ్చ, గురజాడ, అగ్నిపర్రు గ్రంథాలయాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొబ్బ లావణ్య, సుబ్బారావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథా లయం, స్థానిక రాజేంద్రనగర్‌లోని గ్రంథాల యంలో వారోత్సవాలల్లో భాగంగా 4వ రోజు సోమవారం వివిధ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కొడాలి సోమసుందరరావు, కొల్లి శ్రీనివాసరావు, పట్టపు చిన్నా, చంద్రరావు, తెలుగుభాష వికాస సమితి సమన్వయకర్త డి.ఆర్.బి ప్రసాద్, గ్రంథాలయ అధికారి ఎంవిడిటి నగేష్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** పెద్ద కల్లేపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు పరుగు పందేలు, వకృత్వం పోటీలు నిర్వహించారు. అలాగే 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు కబడ్డీ పోటీలు, పరుగు పందెం, బాస్కెట్బాల్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి కే సోమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ఉయ్యూరు, ముదునూరు శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఉయ్యూరు గ్రంథాలయంలో వక్తత్వ, దేశభక్తి గేయాలు, ముదునూరులో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభ కన పరచారు. ఉపాధ్యాయురాలు కె.సుజాత, సాంబశివరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహ రించారు. వారోత్సవాల విశేషాలను గ్రంథాలయ అధికారులు రమణి, నాగరాజు తెలియజేశారు. **ప్రజాశక్తి-పామర్రు :** పామర్రు గ్రేడ్ 2 గ్రంథాలయ శాఖలో సోమవారం నాడు జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ వినియోగంపై శిక్షకుడు నందిపాటి హరీష్ రెడ్డి అవగాహన కల్పించారు. అనంతరం ఐదవ తరగతి లోపు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఎం. ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని జమీ గొ ల్వేపల్లి గ్రంథాలయ శాఖలో విద్యార్థులకు వ్యాసరచన వక్తత్వ పోటీలు నిర్వహించారు. గుమ్మడి ఉషాదేవి,పి.వెంకట ధర్మారావు, గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నాలుగవ రోజు సోమవారం 5 ,6 ,7 తరగతుల 15 మంది విద్యార్థిని విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించామని మొవ్వ గ్రంథాలయాధికారిణి కృష్ణకుమారి తెలిపారు. ఈ పోటీలలో ఎస్ఎంకె జిల్లా పరిషత్ హైస్కూల్, ఇమ్మా నుయేల్ మిషన్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర పుట్టినరోజు వేడుకలు సోమవారం సాయంత్రం విజయవాడలోని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు రవీంద్ర చేత కేకు కోయించి, అతనికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివద్ధి కోసం అంకితభావంతో పనిచేసే రవీంద్ర మరెన్నో

పుట్టినరోజులు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అట్లూరి శీను, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పులిగడ్డలో కోటి దీపోత్సవం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలోని శ్రీ అలివేలు మంగ రాజ్యలక్ష్మి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక సోమవారం పురస్కరించుకొని కోటి దీపోత్సవం వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్- విజయలక్ష్మి దంపతులు, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం -సాయి సుప్రియ దంపతులు విచ్చేసి ప్రత్యేక పూజలు చేసే కార్తీకదీపం వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం ధన్వంత ఆచార్యులు, సత్య కష్ణమాచార్యులు, పార్థసారథి ఆచార్యులు, వికనాసచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) ఏర్పాటు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు.

'అరణ్య' ఐస్‌క్రీమ్స్ ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : బందరులో సాయికృష్ణ నూతనంగా ఏర్పాటు చేసుకున్న అరుణ్ ఐస్ క్రీమ్స్ డిస్ట్రిబ్యూషన్ వ్యాపారాన్ని మచిలీపట్నం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చా ర్జ్, కృష్ణాజిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కాలాన్ని వథా చేయకుండా మనసుకు నచ్చిన వ్యాపకంతో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. సాయి కష్ణ చేపట్టిన ఐస్ క్రీమ్ వ్యాపారం అభివద్ధి చెందాలని ఆకాంక్షించారు.

నేడు తలనీలాలకు బహిరంగ వేలం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో తలనీలాలు లైసెన్స్ హక్కు, ధాన్యం అమ్మకానికి బహిరంగ వేలంపాట ఈనెల 18న మంగళవారం ఉదయం ఉదయం 10 గంటల నుండి జరుగుతుందనిదేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తలనీలాలు వేలమునకు రూ.3 లక్షలు, ధాన్యం అమ్మకం వేలంపాటకు రూ లక్ష, చొప్పున ధరావతులు చెల్లించి, తగు స్థిరాస్తి గ్యారంటీ సమర్పించి, పాటలో పాల్గొనాలన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అంజేత

ప్రజాశక్తి - గుడివాడ : రాష్ట్రంలో పేదల కష్టం తెలిసిన గొప్ప నాయకుడు సిఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం స్థానిక ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజావేదికలో గుడివాడ నియోజకవర్గ పరిధిలోని 21 మంది బాధితులకు మంజూరైన రూ.11 లక్షల చెక్కులను ఎమ్మెల్యే రాము అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ రూరల్, నందివాడ మండలం టిడిపి అధ్యక్షులు వాసే మురళి, దానేటి సన్యాసిరావు, సర్పంచ్ సింగాల రాధాకష్ణ, ఏపీ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడి నాగరాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు మండల గ్రామాల పరిధిలో వరికొతలు ముమ్మరంగా జరుగు తున్నాయి. మొం థా తుపాను కారణంగా కోతలు ఆలస్యంకాగా తరుణం మించి పోతున్న నేపథ్యంలో రైతులు ఒకేసారి కోతలు కోయించేందుకు తొందరపడ డంతో కూలీ రేట్లు అమాంతంగా పెరిగాయి. కోత కోసేందుకు ఎకరాకు రూ.6వేల వరకు కూలీలు డిమాండ్ చేసు న్నారు. కూలీ ఖర్చు, వాతావరణ మార్పుల పరిస్థితుల్లో యంత్రాలతో కోత కోయించేందుకు రైతులు మొగ్గుచూపుతుంటే యంత్రాలు అందు బాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 13,700 ఎకరాల్లో వరిసాగుచేయగా దాదాపు అన్ని గ్రామాల్లో కోతలు ఒకే సారి రావడంతో కూలీలు, యంత్రాల కొరత కన్పిస్తుంది. శ్రీకాకుళం, గోదావరి జిల్లాల నుంచి కూలీలను తీసుకువచ్చి కోతలు కోయిస్తున్నారు.

ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి ఉయ్యూరు : కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని ఉయ్యూరు, మండల పరిధిగ్రామా ల్లో శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. కార్తీకమాసం ఈనెల 20తో ముగుస్తున్న సం దర్భంగా ఉదయం నుంచి శివాలయాలకు భక్తులు తరలివచ్చి దీపారాధన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉయ్యూరు శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వా మి ఆలయ ంలో వేకువజామునుంచి భక్తుల రద్దీ కన్పించింది. కలవపాముల దుర్గామల్లే శ్వరస్వా మి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. బోళ్లపాడు, కాటూరు, ముదునూరు, చినఓగిరాల, పెదఓగిరాల, ఆకు నూరు గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు పూజలుచేశారు. **ప్రజాశక్తి-మొవ్వ :** కూచిపూడి శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పొరుగు ప్రాంతాలనుండి తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. మండలంలోని నిడుమోలు, చినముత్తేవి, అయ్యంకి, యద్దనపూడి, పెదపూడి, కూచిపూడి, గూడపాడు, మొవ్వ, మొవ్వపాలెం, కోసూరు, కాజ గ్రామాలలో గల శివాలయాల్లో భక్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దు: కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం నాణ్యతలో రాజీ పడకుండా సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తన చాంబర్లో జిల్లా స్థాయి స్టీరింగ్ కమ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం అమలు తీరుపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మధ్యాహ్న భోజనం పథకం అమలులో లోటుపాట్లపై ఆరా తీశారు. మెనూలో ఏమైనా మార్పులు అవసరం ఉందా, చిక్కీ, బియ్యం నాణ్యత, గుడ్లు సరఫరా తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. ప్రస్తుతం నడుస్తున్న మెనూ పట్ల విద్యార్థులందరూ సంతృప్తికరంగా ఉన్నారని, బియ్యం నాణ్యత బాగానే ఉందని, అయితే సమయానికి బియ్యం లోడు రావడంలేదని దీనివల్ల ఇబ్బందులు వస్తున్నాయని కలెక్టర్కు వివరించారు. రేషన్ షాపులకు, పాఠశాలలకు వేరువేరుగా బియ్యం సరఫరా అవ్వడం దీనికి ప్రధాన కారణమని పేర్కొంటూ గోనె సంచుల్లో సరఫరా అవుతున్న బియ్యం నాణ్యత బాగుంటుందని, పాల్తిన్ కవర్ల సంచుల్లో వచ్చే బియ్యంలో కొన్ని సార్లు పురుగులు వస్తున్నట్లుగా ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యలపై లేఖ ద్వారా ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఇఓ పివిజె రామారావు, ఐసిడిఎస్ పీడీ ఎం ఎన్ రాణి, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, డీఎస్ఓ జీ మోహన్ రావు, పౌర సరఫరాల సంస్థ జిఎం టి శివరామ్ ప్రసాద్, సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల అధికారులు షేక్ షాహిద్ బాబు, జీ రమేష్, పాల్గొన్నారు.

బస్సు ప్రమాదం బాధాకరం

షేక్ అష్రఫ్ అహ్మద్

ప్రజాశక్తి-కంకిపాడు : సౌదీ అరేబి యాలోని పవిత్ర మక్కా నుంచి మదీనకు వెళ్తున్న యాత్రికులు 42 మంది బస్సు ప్రమాదంలో చనిపోవడం చాలా బాధాకరమని, వారి కుటుం బాలకు ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నట్లు వైఎస్ఆర్సిపి స్టేట్ మైనారిటీ సెల్ జాయింట్ సెక్రెటరీ షేక్ అష్రఫ్ అహ్మద్ తెలిపారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ తెలుగు రాష్ట్రాలకు చెందిన యాత్రికులు చనిపోవడం బాధాకరమన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** సౌదీ ప్రమాదంలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని పమిడిముక్కల మండలంలోని ఆలీనాకిపాలెంకు చెందిన జాఫర్ ఆలీ అన్నారు. సౌదీలో బస్సు ప్రమాదంలో మరణించిన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కోరారు. వాతావరణంలో ప్రతికూల పరిస్థితులు అధిక వర్షాల వల్ల పత్తిలో నాణ్యత తగ్గిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కొనుగోలులో నిబంధనలు సడలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎంసీ చైర్మన్గా బి నవ్యశ్రీ, వైస్ చైర్మన్‌గా చేబ్రోలు రాజులతో పాటు పాలకవర్గ సభ్యులు తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మైలవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చారుగొండ్ల ప్రసాద్, తెలుగు యువత అధ్యక్షులు లంక లితిష్ పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** తిరుమలగిరి గ్రామంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొఠారి సత్యనారాయణ ప్రసాద్, డీసీ కెనాల్ వైస్ చైర్మన్ మన్నే నారాయణరావు, దర్శి విజయ నరసింహారావు, గుమ్మ మధు, గండు కిషోర్ మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

భగవద్గీత పోటీల్లో విపిఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: మొగల్రాజపురంలోని వీరమాచినేని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్లో చిన్మయ మిషన్ నిర్వహించిన భగవద్గీత పఠన పోటీలలో 500 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. 40 మందికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రకటించారు. ప్రశంసాపత్రాలతో పాటు 7,500 రూపాయల నగదు బహుమతులను అందించారు. జిల్లా స్థాయిలో విపిఎస్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. గ్రూప్ ఎ కేటగిరీలో యూకేజి చిన్నారులు కె.ప్రద్యుమ్న ప్రథమ బహుమతి, ఎం.ధ్రువ నరసింహనాయక్ తృతీయ బహుమతి, గ్రూప్-డిలో 5వ తరగతి నుండి ఎం.ఎస్.శాన్వి, 6వ తరగతి నుండి ఎస్.మౌక్తిక ద్వితీయ బహుమతి, గ్రూప్-ఈలో 7వ తరగతి విద్యార్థిని టి.మేధా తృతీయ బహుమతులను సాధించారు. వీరికి డిసెంబర్ 1న గీతా జయంతి పర్వదినాన బహుమతులను అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయినులు టిఎన్.కృష్ణప్రియ, ఎ.రామలక్ష్మిలను పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, వైస్ ప్రిన్సిపల్ రోజ్‌మేరీ, ప్రధానోపాధ్యాయులు చల్లా జయలక్ష్మి అభినందించారు.

ఆలయాభివృద్ధికి రూ.5.25 లక్షలు విరాళం

ప్రజాశక్తి-వత్సవాయి: పెనుగంచిప్రోలులోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం

అభివృద్ధికి మల్లెబోయిన గురునాథం, నాగ పద్మావతి దంపతుల సహకారంతో వారి స్నేహితులు పాళ్లి అప్పారావు కుమారుడు పాళ్ళి కల్యాణ శ్రీనివాసరావు, సుధా దంపతులు (అమెరికా యూఎస్ఎ) రూ.5.25 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రఘురామారావు, మాజీ జడ్పిటిసి సభ్యులు గజ్జి కృష్ణమూర్తి, తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ కాకాని శ్రీనివాసరావు, రేగండ్ల రవికుమార్, కర్ల వెంకటనారాయణ పాల్గొన్నారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయండి : ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి-తిరువూరు: పేద పిల్లల కడుపుకొట్టి సంపాదిస్తున్న బిసి హాస్టల్ వార్డెన్ సస్పెండ్ చేసి ఆయన స్థానంలో మరొకరిని వెంటనే నియమించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి బిసి వేల్ఫేర్ జిల్లా అధికారికి ఆదేశాలిచ్చారు.

తిరువూరు పట్టణంలో ఆయన సోమవారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, అంగన్వాడీ కేంద్రాలను, ఎస్‌సి బాలికల, బిసి బాలుర హాస్టళ్లను తనిఖీ చేశారు. బిసి బాలురు కాలేజీ, హైస్కూల్ హాస్టల్ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వార్డెన్ మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బిసి వేల్ఫేర్ జిల్లా అధికారికి ఫోన్ చేసి వార్డెన్ మోజేష్ విద్యార్థులకు ఉదయం పాలు ఇవ్వటం లేదని, కోడి గుడ్లు పెట్టడం లేదని, మెనూ పాటించడంలేదని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. బాలికోన్నత పాఠశాలలో మధ్యా హ్న భోజనం రుచిగా ఉండటం లేదని విద్యార్థినులు చెప్పారని, దీనిని సరిచేయాలని ప్రధానోపాధ్యాయులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

20న ధర్నాను జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-నందిగామ: సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 20న విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు బిల్డింగ్ అండ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె.గోపాల్, నందిగామ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీపతి హరిబాబు మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పని చేయించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గులాయ్ దస్తగిరి బాజీ, కోశాధికారి కొరగంటి ఆనందరావు, ఉపాధ్యక్షులు మందా స్వామి, ఉపాధ్యక్షులు కమాదుల నాగరాజు, సహాయ కార్యదర్శి కొంద్ర కోండ రాము, సహాయ కార్యదర్శి కామా రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు

దుర్గగుడి ఈవో శీనా నాయక్

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: భవానీ దీక్షల విరమణ సందర్భంగా చేయబోయే ఏర్పాట్ల గురించి సోమవారం దుర్గగుడి ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, కార్యనిర్వాహణాధికారి వి.కే.శీనానాయక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మల్లికార్జున మహామంటపం 4వ అంతస్తులో జరిగిన సమావేశంలో వైదిక కమిటీ, ఇంజినీరింగ్, ఫెస్టివల్, అన్నదానం, ప్రసాదాల తయారు, ప్రధాన ఆలయం అధికారులు పాల్గొన్నారు. డిసెంబర్ 4న జరిగే కలశ జ్యోతి ఊరేగింపు కార్యక్రమం విజయవంతం చేయాలని, దీక్షా విరమణ సందర్భంగా యాత్రికులు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇరుముడి పాయింట్లు, హోమగుండాల ఏర్పాటు, అన్న ప్రసాదం, లడ్డు ప్రసాదం సమృద్ధిగా ఏర్పాటు చేయాలని కోరారు. దర్శన క్యూలైన్లు, మంచి నీరు, మెడికల్ క్యాంప్స్, గిరి ప్రదక్షిణ మార్గం, కేశఖండన, మైక్ ప్రచారం, ఉచిత బస్ నిర్వహణ ప్రణాళిక ప్రకారం జరగాలని ఆదేశించారు.

కుష్టు బాధితుల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి-తిరువూరు

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా సోమవారం తిరువూరు నియోజకవర్గంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిగ్ర స్తుల గుర్తింపు సర్వే ప్రారంభమైంది. తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చౌటపల్లి, రాజు గూడెం, ఏకొండూరు, గంపలగూడెం, ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టారు. కుష్టు లక్షణాలున్న వారు తమకు తెలియజేయాలని, పీహెచ్సీలలో ఎండీటీ మందులు ఉచితంగా లభిస్తాయని తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం యాత్రికులు రూ.1,12,559 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన నామేపల్లి వెంకటేశ్వరరావు, ఇస్కాల వెంకటేశ్వర్లు, వసంతలక్ష్మిలకు ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, ఆలయ సహాయ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు.

పొగాకు దుష్ఫలితాలపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

పొగాకు వినియోగం ప్రజారోగ్యానికి సంబంధించి అతి పెద్ద సవాళ్లలో ఒకటిగా నిలిచి ఉందని, అందుకే పొగాకు వాడటం వలన ఎటువంటి ఇబ్బందులు వస్తాయి అనే దానిపై అవగాహన కల్పిస్తున్నట్లు ప్రజారోగ్య నిపుణులు డాక్టర్ డెలన్. హ్యూమన్ తెలిపారు. నగరంలోని వో హోటల్లో అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు హాని తగ్గింపు, ధూమపానం మానేయడానికి మెరుగైన మద్దతు, వ్యాధిని ముందుగా గుర్తించే విధానాలు వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ధూమపానానికి సంబంధించిన మరణాల రేటును వినూత్నమైన శాస్త్రీయ ఆధారిత విధానాల తగ్గించవచ్చన్నారు.

కెటి రోడ్డు, అవుట్ ఫాల్ డ్రైన్ వెడల్పు చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ

పశ్చిమ నియోజకవర్గంలోని చిట్టినగర్ జంక్షన్ నుండి శ్రీనివాస మహల్ జంక్షన్ వరకు తమ్మిన పోతురాజు రోడ్ (కేటి రోడ్)తూర్పు వైపు అవుట్ ఫాల్ డ్రెన్ వెడల్పు చేసి నిర్మించాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు ఆయన విఎంసిలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ కెటి రోడ్డుతూర్పు వైపు డ్రెన్ వైశాల్యం తక్కువగా ఉన్నందున వర్షాకాలంలో వాగు సెంటర్ కొండ ప్రాంతం నుండి వచ్చే వర్షపు నీరు, ప్రజా వినియోగం మురుగు నీరు నివాస గృహాల్లోకి చేరి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై గత జూలైలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో డ్రెన్ వెడల్పు చేయాలని ప్రతిపాదన ఆమోదించినప్పటికీ అధికారులు తగు చర్యలు చేపట్టడం లేదన్నారు. గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో సైడ్ కాలువ పాడైపోవడం వలన మురుగునీరు ప్రవహించడం లేదన్నారు. వెంటనే డ్రెయిన్ నిర్మాణం పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు బకాయిలు చెల్లించాలి

విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్య బాబు కోరారు. ఈ మేరకు ఆయన నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ గరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శానిటేషన్ కార్మికులను సప్లై చేసిన ప్రైవేట్ కాంటాక్ట్స్ సంస్థలు ఆర్కే సర్వీసెస్, యశ్వంత్ ఫెసిలిటీ సర్వీసెస్ సంస్థల ఇద్దరు కాంట్రాక్టర్లు లీజు కాలపరిమితి ముగిసినప్పటికీ, కార్మికుల వేతనాలు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించినట్లు ముందుగా కార్మికుల చేత బిల్లు ఫారంపై సంతకాలు తీసుకొని వేతన బకాయిలు చెల్లించకుండా గత రెండు నెలల నుండి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు అన్నారు. నగరపాలక సంస్థ అధికారులు వెంటనే స్పందించి కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించే విధంగా సదరు కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.